@netifocusnews @focustv www.netifocusnews.com
TS-18-0006625
FOCUS TELUGU TV అనునిత్యం - ప్రజాపక్షం
# నేటి ఫోకస్ న్యూస్
అను నిత్యం...ప్రజా పక్షం...
COMPLIMENTARY COPY
తెలుగు డిజిటల్ దినపత్రిక
ఎడిటర్: యం.తరుణ్ || తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక || శుక్రవారం 05, ఏప్రిల్ 2024 || పేజీలు: 04



## జగ్జీవన్ రామ్ జీవితం స్ఫూర్తిదాయకం

- జయంతి సందర్భంగా స్మరించుకున్న సిఎం రేవంత్

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-ఎప్రిల్4:

స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఉప ప్రధాన మంత్రి బాబూ జగ్జీవన్ రామ్ జీవితం స్ఫూర్తిదాయకమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. బాబూ జగ్జీవన్ రామ్ 117వ జయంతిని పురస్కరించుకొని బాబూజీ సేవలను సీఎం రేవంత్ స్మరించుకున్నారు. అత్యంత పేదరికంలో జన్మించిన జగ్జీవన్‌రామ్ మిగతా 2లో..

# తుక్కుగూడ జనజాతర అదిరిపోవాలి

## రేపు తుక్కుగూడ బహిరంగ సభను 10 లక్షల మందితో నిర్వహించాలి

- మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలకు సీఎం, టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం
- ఖర్గే, రాహుల్, ప్రియాంకహాజరయ్యే సభను విజయవంతం చేయడంపై ప్రత్యేక దృష్టి
- సభాస్థలి వద్ద ఏర్పాట్ల పరిశీలన.. అక్కడే గంటన్నరపాటు సమావేశం
- పార్కింగ్‌కు ఇబ్బందుల్లేకుండా చూడాలని ఆదేశం

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-ఏప్రిల్ 4:

లోక్‌సభ ఎన్నికలకు జాతీయ స్థాయిలో శంఖారావంగా కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో ఈ నెల 6న నిర్వహించనున్న జన జాతర బహిరంగ సభను విజయవంతం చేయడంపై ముఖ్యమంత్రి, టీపీసీసీ చీఫ్ ఎ. రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టిపెట్టారు. 60 ఎకరాల మైదానంలో నిర్వహించే ఈ సభ ఏర్పాట్లను మంత్రివర్గ సహచరులు, పార్టీ ఎంపీ అభ్యర్థులతో కలసి పర్యవేక్షిస్తున్నారు. ఇందుకోసం పార్టీ నేతలతో వివిధ కమిటీలు ఏర్పాటు చేసిన సీఎం.. గురువారం సాయంత్రం స్వయంగా సభా వేదిక వద్దకు వెళ్లి, మంత్రులు, పార్టీ నేతలతో సుమారు గంటన్నరపాటు సమావేశమయ్యారు. పదేళ్ల తరువాత రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సత్తా చాటేలా 10 లక్షల మందితో కనీవినీ ఎరుగని రీతిలో సభ నిర్వహిం చేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఈ భేటీలో మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, సీతక్క, ఎమ్మెల్యేలు రాజగోపాల్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, దానం నాగేందర్, పలువురు ఎంపీ అభ్యర్థులు పాల్గొన్నారు.

### 10లక్షల జనం తరలాల్సిందే..

పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ నేత ప్రియాంకా గాంధీ హాజరయ్యే ఈ సభ ద్వారా జాతీయ స్థాయిలో కాంగ్రెస్ సత్తా చాటాలని రేవంత్‌రెడ్డి పార్టీ నేతలకు దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది. ఈ సభా వేదిక నుంచే జాతీయ స్థాయిలో పార్టీ మేనిఫెస్టోను విడుదల చేయడంతోపాటు అధికారంలోకి వస్తే అమలు చేయనున్న ఐదు గ్యారంటీలను కూడా రాహుల్ గాంధీ ప్రకటించనున్న నేపథ్యంలో సభకు దేశవ్యాప్తంగా ప్రాచుర్యం లభించనుందని రేవంత్ పేర్కొన్నారు.

అందువల్ల సభను విజయవంతం చేసేందుకు ఉమ్మడి 10 జిల్లాల నుంచి మొత్తం 10 లక్షల మంది ప్రజలను సభకు తరలించాల్సిందేనని స్పష్టం చేశారు. ఇందుకోసం అన్ని జిల్లాల మంత్రులు, ఇన్‌చార్జి మంత్రులు, సిట్టింగ్ ఎమ్మెల్యేలతోపాటు పార్టీ ఎంపీ అభ్యర్థులు కూడా శ్రద్ధ తీసుకోవాలని సీఎం చెప్పినట్లు సమాచారం.

ప్రధానంగా హైదరాబాద్, రంగారెడ్డి, మిగతా 2లో..





## మద్యం కేసులో కవితే అసలు సూత్రధారి

- అవినీతి కేసుల్లో ఆడవారికి బెయిల్ ఇవ్వరాదు
- అప్రూవర్‌కు బెదరింపులు.. ఆధారాలు ధ్వంసం
- కవితపై కోర్టులో ఇడి వాదనలు
- సోమవారానికి తీర్పును వాయిదా వేసిన కోర్టు

## ఫోన్ ట్యాపింగ్‌కు కేసీఆర్‌దే బాధ్యత

- బీఆర్ఎస్ గుర్తింపును ఈసీ వెంటనే రద్దు చేయాలి
- గవర్నర్‌ను కలిసి దర్యాప్తు కోసం విన్నవిస్తాం
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-ఏప్రిల్4:

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం తీవ్రమైన అంశమని, ఇది రాజకీయ స్వప్రయోజనాలకు వాడుకున్న కెసిఆర్‌పై చర్యలు తసీఉకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి అన్నారు. ఇది అషామాషీ కేసు కాదని.. కక్ష సాధింపు చర్యేనని అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్యాన్ని హత్య చేసేలా బీఆర్ఎస్ వ్యవహరించిందని మండిపడ్డారు. పౌరుల హక్కులకు బీఆర్ఎస్ భంగం కలిగించదన్నారు. రాజకీయపరమైన లబ్ది కోసమే ఫోన్ ట్యాపింగ్ చేశారని ఆరోపించారు. దుబ్బాక, మునుగోడు బైపోల్ టైమ్ లో కూడా ట్యాపింగ్ జరిగిందని కిషన్ రెడ్డి ఆరోపించారు. పారిశ్రామిక మిగతా 2లో..



## మండుతున్న ఎండలు

- పలు ప్రాంతాల్లో 42 డిగ్రీల నమోదు

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-ఎప్రిల్4:

తెలంగాణలో ఎండలు మండుతున్నాయి. దీనికితోడు వడ గాలుల వీస్తున్నాయి. ప్రజలు యటకు రావాలంటేనే జంకుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో మిగతా 2లో..



## తెలంగాణ భవన్‌కు వాస్తు దోషం

### మార్పులు చేర్పులు చేస్తున్న పార్టీ..

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-ఏప్రిల్4:

భారాస కేంద్ర కార్యాలయం తెలంగాణ భవన్‌కు వాస్తు మార్పులు చేస్తున్నారు. పార్టీ అధికారం కోల్పోవడంతో పాటు నేతల వలసలు కూడా పెరిగాయి. వాస్తుదోషం కారణంగానే పార్టీకి కష్టాలు వచ్చాయని నేతలు భావిస్తున్నట్టు సమాచారం. దీంతో అవసరమైన మార్పులు.. చేర్పులు చేయాలని నిర్ణయించారు. ఇందులో ప్రధానమైనది మిగతా 2లో..

## నేత కార్మికులపై కాంగ్రెస్ కక్ష

- వారి ఉపాధిపై దెబ్బకొట్టిన సర్కార్
- కాంగ్రెస్ రాకతో చీకట్లు అలముకున్నాయి
- వెంటనే ఆదుకునే ఏర్పాట్లు చేయాలి
- సిఎం రేవంత్ రెడ్డికి కెటిఆర్ బహిరంగ లేఖ

నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్-ఏప్రిల్4:

నేతన్నలపై కాంగ్రెస్ సర్కారు కక్ష కట్టిందని, ఎందుకింత కక్ష అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు.నేతన్నలు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ఆదుకోరా?... కార్మికులు రోడ్డున పడ్డా కనికరించరా?.. అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. ఈ సందర్భంగా గురువారం ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ.. పదేళ్ల తరువాత సమైక్యరాష్ట్రం నాటి సంక్షోభం తెలంగాణలో ఏర్పడిందని అన్నారు. నేతన్నల బతుకులు ఆగం అయ్యేలా కాంగ్రెస్ విధానాలు ఉన్నాయని, నేతన్నలకు కాంగ్రెస్ ప్రభుత్వం అర్డర్లు అపేసిందని మండిపడ్డారు. గతంలో మాదిరిగా మిగతా 2లో..






## నల్లగొండలో త్రిముఖ పోరు

- గత అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటిన కాంగ్రెస్
- మరోమారు విజయంపై దృష్టి పెట్టిన హస్తం పార్టీ

2

## తక్కుగూడ జనజాతర అదిరిపోవాలి

(మొదటి పేజీ తరువాయి..)

పాలమూరు, నల్లగొండ, ఖమ్మం, మెదక్ జిల్లాల నుంచి భారీగా జన సమీకరణ జరపాలని రేవంత్ స్పష్టం చేసినట్లు తెలిసింది. సభ జరిగే మైదానం పక్కనే సుమారు 300 ఎకరాల ఖాళీ స్థలం అందుబాటులో ఉండటంతో సభకు వచ్చే వాహనాల పార్కింగ్‌కు ఇబ్బందులు తలెత్తకుండా అధికార యంత్రాంగానికి సీఎం ఆదేశాలు జారీ చేశారు.

## జగ్జీవన్ రామ్ జీవితం స్ఫూర్తిదాయకం

(మొదటి పేజీ తరువాయి..)

అకుంఠిత దీక్షతో అత్యున్నత స్థానానికి ఎదిగారని పేర్కొన్నారు. జాతీయోద్యమం లో పాల్గొన్న ఆయన రాజ్యాంగ పరిషత్ సభ్యునిగానూ సేవలందించారని, స్వాతంత్ర్యానంతరం తొలి ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ మంత్రివర్గంలో తొలి కార్మిక శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించి కార్మిక సంక్షేమానికి పాటుపడ్డారన్నారు. కార్మిక పక్షపాతిగా గుర్తింపు పొందిన బాబూజీ రెండు దఫాలు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిగానూ సేవలు అందించారని తెలిపారు. దేశవ్యాప్తంగా కరవు తాండవిస్తు న్నప్పుడు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిగా హరిత విప్లవం విజయవంతంలో కీలక పాత్ర పోషించారని ప్రశంసించారు. అంటరానితనం, కుల వివక్ష నిర్మూలనకు బాబూజీ పోరాడారని, దళితుల అభ్యున్నతికి ఎంతగానో పాటుపడ్డారని సీఎం పేర్కొన్నారు. జగ్జీవన్ రామ్ ఆశయాలను కొనసాగిస్తామన్నారు.

## మద్యం కేసులో కవితే అసలు సూత్రధారి

నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ-ఏప్రిల్4:

ఢిల్లీ మద్యం కేసులో అరెస్ట్ అయి ప్రస్తుతం తిహార్ జైల్లో ఉన్న ఎమ్మెల్సీ కవిత బెయిల్ పిటిషన్‌పై రౌజ్ అవెన్యూ కోర్టులో వాదనలు ముగిశాయి. ఈడీ దాఖలు చేసిన కౌంటరుపై కవిత తరపు న్యాయవాదులు రిజాయిండర్ దాఖలు చేశారు. కుమారుడి పరీక్షల దృష్ట్యా మధ్యంతర బెయిల్ ఇవ్వాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. కవిత తరఫున మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై సీనియర్ న్యాయవాది అభిషేక్ మనూ సింఘ్వీ కోర్టులో వాదనలు వినిపించారు. బెయిల్ ఇస్తే ఆధారాలు, సాక్షులను ప్రభావితం చేస్తారని ఈడీ తరపు న్యాయవాది వాదనలు వినిపించారు. కవితకు వ్యతిరేకంగా చాలా ఆధారాలు ఉన్నాయి. ఢిల్లీ మద్యం కుంభకోణానికి కవితే ప్రణాళిక రచించారు. ఆమె తన ఫోన్ డేటాను డిలీట్ చేశారు. దర్యాప్తులో అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేదు. పది ఫోన్లు ఇచ్చినా అన్నీ ఫార్మాట్ చేసే ఇచ్చారు. నోటీసులు ఇచ్చిన తర్వాత 4 ఫోన్లను కవిత ఫార్మాట్ చేశారు. నిందితులు వందల డిజిటల్ డివైజ్‌లను ధ్వంసం చేశారు. అప్రూవర్‌గా మారిన వ్యక్తిని కవిత బెదిరించారు. తనకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పవద్దని బెదిరించారు. ఆమె చిన్న కుమారుడు ఒంటరి కాదు. సోదరుడు, కుటుంబ సభ్యులు తోడుగా ఉన్నారు. కుమారుడి పరీక్షల కోసం మధ్యంతర బెయిల్ అడిగారు. కొన్ని పరీక్షలు ఇప్పటికే పూర్తయ్యాయి అని ఈడీ తెలిపింది. వాదనల అనంతరం రౌజ్ అవెన్యూ కోర్టు తీర్పును రిజర్వు చేసింది. సోమవారం తీర్పు వెలువరించనున్నట్లు న్యాయమూర్తి తెలిపారు. ఏప్రిల్ 20న రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌పై వాదనలు వింటామని కోర్టు తెలిపింది. ఈ కేసులో ప్రధాన సూత్రధారి ఎమ్మెల్సీ కవిత అని ఆరోపించారు. కుమారుడికి పరీక్షల నేపథ్యంలో మధ్యంతర బెయిల్ ఇవ్వాలని ఒక పిటిషన్, మధ్యంతర బెయిల్‌పై ఒక పిటిషన్‌పై విదానలు వినిపిస్తున్నారు అభిషేక్ మను సింఘ్వి. బెయిల్ పిటిషన్‌పై వాదనల సందర్భంగా ఈడీ తన వాదనలు బలంగా వినిపించింది. అవినీతి కార్యకలాపాల్లో ఉన్న మహిళకు బెయిల్ ఇవ్వకూడదని ఈడీ బలంగా వాదించింది. ఒకవేళ బెయిల్ ఇస్తే ఆధారాలు, సాక్ష్యాలను ప్రభావితం చేస్తారని కోర్టుకు తెలియజేసింది. కవితకు వ్యతిరేకంగా అనేక ఆధారాలు ఉన్నాయని ఈడీ స్పష్టం చేసింది. లిక్కర్ స్కామ్‌ను ప్లాన్ చేసిందే కవిత అని ఆరోపించారు. ఫోన్ డేటా మొత్తాన్ని డిలీట్ చేశారని ఆరోపించారు. తాము అడిగిన ప్రశ్నలకు కూడా సమాధానం ఇవ్వలేదన్నారు. అప్రూవర్‌గా మారిన వ్యక్తిని తనకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పవద్దంటూ కవిత బెదిరించారని ఆరోపించారు. అంతేకాదు.. కవితకు వ్యతిరేకంగా సేకరించిన ఆధారాలను ఈడీ తరపు న్యాయవాది జడ్జికి సమర్పించారు.

## కేజ్రీవాల్‌కు ఢిల్లీ కోర్టులో ఊరట

నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ-ఏప్రిల్4:

ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటూ తిహార్ జైలులో ఉన్న సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు కోర్టులో ఊరట లభించింది. జైలులో ఉన్న ఆయనను సీఎం పదవి నుంచి తొలగించాలని దాఖలైన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు గురువారం రోజున తిరస్కరించింది. సీఎం పదవిలో కొనసా గాలా వద్ద అనే అంశం కేజ్రీవాల్ వ్యక్తిగతంగా నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది కోర్టు తెలిపింది. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో ఈడీ కస్టడీలో ఉన్నందున కేజ్రీవాల్‌ను సీఎం పదవి నుంచి తొలగించాలని కోరుతూ వారం రోజుల క్రితం ఢిల్లీ హైకోర్టులో పిల్ దాఖలైంది. హిందూ సేన జాతీయ అధ్యక్షుడు, సామాజిక కార్యకర్త విష్ణు గుప్తా ఈ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం.. ఈ అంశంలో ఎటు వంటి నిర్ణయం తీసుకోలేదని తెలిపింది.

# నేత కార్మికులపై కాంగ్రెస్ కక్ష

(మొదటి పేజీ తరువాయి..)

నేతన్నలకు చేతినిండా అర్డర్లు వేంటనే ఇవ్వాలని, బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వడంతోపాటు ఎన్నికల కోడ్ వల్ల ఆపిన పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. చేనేత మిత్రా వంటి పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం పక్కన పెట్టిందని.. ప్రస్తుతం అందుతున్న అన్నీ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. అవసరం అయితే మరింత సాయం చేయాలని సూచించారు. కేవలం గత ప్రభుత్వంపై దుగ్ధతతో నేతన్నల పొట్ట కొట్టడం సరైంది కాదన్నారు. రైతన్న మాదిరే, నేతన్నలు ఆత్మహత్యలు చేసుకోవడం అత్యంత బాధకరమని, వస్త్ర పరిశ్రమను ఆదుకోకపోతే కాంగ్రెస్ సర్కార్ భారీ మూల్యం చెల్లించక తప్పదని కేటీఆర్ అన్నారు. ఈ పదేండ్లలో నేతన్నలకు చేతి నిండా పని కల్పిస్తే.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సమైక్య రాష్ట్రంలో నాటి సంక్షోభం నెలకొందని ఆయన పేర్కొన్నారు. నేతన్నలకు ఆర్డర్లు ఆపడం సరికాదన్నారు. బీఆర్ఎస్ హయాంలో మాదిరే నేతన్నలకు చేతి నిండా పని కల్పించాలని కోరారు. బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వడంతోపాటు ఎన్నికల కోడ్ వల్ల ఆపిన పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి అని డిమాండ్ చేశారు. చేనేత మిత్రా వంటి పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం పక్కన పెట్టిందని కేటీఆర్ తెలిపారు. ప్రస్తుతం అందుతున్న అన్నీ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేయాలి. అవసరమైతే మరింత సాయం చేసి ఆదుకోవాలన్నారు. కేవలం గత ప్రభుత్వంపై దుగ్ధతో నేతన్నల పొట్ట కొట్టడం సరైంది కాదు. రైతన్న మాదిరే, నేతన్నలు ఆత్మహత్యలు చేసుకోవడం అత్యంత బాధకరం. వస్త్ర పరిశ్రమను ఆదుకోకపోతే కాంగ్రెస్ భారీ మూల్యం చెల్లించక తప్పదని కేటీఆర్ హెచ్చరించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేటీఆర్ లేఖ రాశారు. బీఆర్ఎస్ పాలనలో పదేళ్లు పండుగలా కళకళలాడిన చేనేతరంగం.. మీ కాంగ్రెస్ రాగానే మళ్లీ సంక్షోభంలో కూరుకుపోయింది. 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ హయాంలో వస్త్ర పరిశ్రమ ఎలాంటి దుర్భర పరిస్థితుల్లో మునిగిపోయిందో.. మళ్లీ కాంగ్రెస్ వచ్చి నాగులునెలలు గడవకముందే అదే విపత్కర పరిస్థితిని ఎదుర్కొంటోంది. మీ కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న కక్షపూరిత వైఖరి వల్ల గత నాలుగు నెలలుగా నేతన్నలు చేనేత పనులకు దూరం అవడంతోపాటు, పవర్ లూమ్స్ పూర్తిగా బంద్ అయ్యాయి. చేనేత కార్మికులు, పవర్ లూమ్ ఆసాములతోపాటు కార్మికులు రోడ్డున పడటంతో.. పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. మీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి, ముందు చూపు లేకపోవడం వల్ల వేలాది మంది నేతన్నలు, పవర్ లూమ్ కార్మికులు, వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఉపాధి కోల్పోయి ఆర్థిక ఇబ్బందులతో వారి జీవితాలు దుర్భరంగా మారుతున్నా మీ ప్రభుత్వానికి కనీస కనికరం లేదు. తమకు పని కల్పించాలని డిమాండ్ చేస్తూ కార్మిక లోకం.. ప్రతినిత్యం దీక్షలు, ధర్నాలు, నిరసనలతో.. ఏదో ఒక రూపంలో తమ ఆందోళన కొనసాగిస్తున్నప్పటికీ మీ ప్రభుత్వంలో ఏమాత్రం చలనం లేకపోవడం అత్యంత దారుణమైన విషయం. ఆదుకోవాల్సిన అధికార పార్టీ నేతలే కార్మికులను అవమానించేలా మాట్లాడటం.. వారి మనోస్థయిర్యాన్ని మరింత దెబ్బతీస్తోంది. ఇటీవల కాంగ్రెస్ నేత కేకే మహేందర్ రెడ్డి వ్యాఖ్యలు చేయడం ప్రతి కార్మికుని గుండెను గాయపరిచింది. ఈ క్రమంలోనే ఆర్థిక ఇబ్బందులతో సిరిసిల్ల జిల్లా కేంద్రంలో తడుక శ్రీనివాస్ అనే నేత కార్మికుడు ఉరి వేసుకుని తనువు చాలించాడు. ఇది ఆత్మహత్య కాదు.. ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన హత్యగానే నేతన్నలు భావిస్తున్నారు. నేతన్నలపైనా కాంగ్రెస్ కున్న చిన్న చూపు ఈ వ్యాఖ్యల ద్వారా స్పష్టంగా అర్థమవుతోంది.దకొత్తగా ప్రభుత్వంలోకి వచ్చిన మీకు ఒక్క సారి గతం గురించి వివరించే ప్రయత్నం చేస్తున్నాను. సరిగ్గా ఇవే పరిస్థితులు సమైక్యరాష్ట్రంలో నెలకొని ఉండేవి. తెలంగాణ సాధించాక పాలనా పగ్గాలు చేపట్టిన కేసిఆర్ గారు తెలంగాణలో నేతన్నలను, వస్త్ర పరిశ్రమకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి, సంక్షోభం నుంచి గ్టటెక్కించడానికి ఎన్నో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. చిక్కిశల్యమైన ఈ పరిశ్రమను ఆదుకోవడానికి స్వయంగా వస్త్ర పరిశ్రమ పెద్దలను పిలిపించి ఒక రోజంతా అధికారులతో కలిసి అప్పటి సీఎం కేసిఆర్ గారు సమీక్ష నిర్వహించారు. నేతన్నల వేతనాలను, కూలీలను రెట్టింపు అయ్యేలా, ప్రతి కార్మికుడు నెలకు 15 నుంచి 20 వేలు సంపాదించుకుని గౌరవప్రదంగా జీవించేందుకు పటిష్టమైన కార్యాచరణను రూపొందించారు. అనేక వినూత్నమైన సంక్షేమ కార్యక్రమాలు తీసుకువచ్చారు. చేనేత మిత్రా, నేతన్నకు చేయూత వంటి కార్యక్రమాలు ప్రారంభించాము. వీటి కోసం భారీ ఎత్తున గత 60 ఏండ్లలో ఎప్పుడు లేనంత బ్జడెట్ కేటాయించాము. గతంలో ఇతర రాష్ట్రాలనుంచి సరఫరా అయ్యే, రాజీవ్ విద్యా మిషన్, సర్వశిక్ష అభియాన్ కార్యక్రమాల ఆర్డర్లను రాష్ట్రంలోని నేతన్నలకు ఇచ్చి, చేతి నిండా పని కల్పించింది నాటి ప్రభుత్వం. దీంతో అప్పటిదాకా ఉపాధి లేక అల్లాడిన కార్మికులకు పని లభించింది. సంప్రదాయంగా వస్తున్న వృత్తిని కొనసాగిస్తూనే పోటీ ప్రపంచాన్ని తట్టుకునేలా వారిని తీర్చిదిద్దేందుకు కూడా ప్రభుత్వం తోడ్పాటునందించింది. మగ్గాల అధునీకీకరణ, రుణాల మాఫీ, మార్కెట్ తో అనుసంధానం వంటి అల్ రౌండ్ అప్రోచ్ తో ముందుకు సాగింది. వీటన్నింటి వలన కార్మికులకు ఉరట లభించడంతో, వీరికి మరింత పని కల్పించడంతోపాటు, కడుపునిండా అన్నం పెట్టేలా బీఆర్ఎస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్మాత్మకంగా అమలుచేసిన బతుకమ్మ చీరల పథకం ప్రారంభించింది. బతుకమ్మ చీరల ఆర్డర్లు కూడా అందించడంతో.. కార్మికులకు చేతి నిండా పని దొరికింది. దీంతోపాటు.. రంజాన్, క్రిస్మస్ కానుకల్లో ఇచ్చే వస్త్రాల ఆర్డర్లు కూడా వారికి ఇవ్వడంతో కార్మికులకు మరింత ఉపాధి పెరిగింది. ఇలా ఏడాదికి దాదాపు ఎనిమిది నెలల వరకూ వరుస ఆర్డర్లు అందడంతో.. సాంచాల పరిశ్రమలో సంతోషం వెల్లివిరిసింది. పవర్ లూమ్ లను ఆధునీకరించుకునేందుకు సబ్సిడీపై రుణాలు కూడా ఇవ్వడంతో వస్త్ర పరిశ్రమపై ఆధారపడిన జీవితాల్లో కొత్త వెలుగులు నింపినట్టయింది. నేత రంగానికి పూర్వ వైభవం తీసుకురావడమే లక్ష్యంగా సాగిన ఆ మహాయజ్ఞం ఎన్నో గొప్ప ఫలితాలను ఇచ్చింది. తెలంగాణలో వస్త్రపరిశ్రమ విస్తరించి ఉన్న వివిధ ప్రాంతాలతోపాటు.. కాంగ్రెస్ తోపాటు గత ప్రభుత్వాల పాలనలో ఒకప్పుడు ఉరిశాలగా ఉన్న సిరిసిల్ల కొత్త కాంతులతో వెలుగులీనింది. వీటికి తోడు నేతన్నకుభీమా అమలుచేయడంతో కార్మికుల కుటుంబాలకు ధీమా లభించింది. వారి ఆర్థిక పరిస్థితి మెరుగుపడటంతో కార్మికలోకంలో కొనుగోలు శక్తి కూడా పెరిగింది.. ఓవైపు కార్మికుల సంక్షేమం, మరోవైపు సమగ్ర అభివృద్ధితో వారి జీవితాల్లో గుణాత్మక మార్పు వచ్చింది. పవర్ లూమ్ కార్మికులు అధికంగా ఉండే? కరీంనగర్, సిరిసిల్లతోపాటు.. వరంగల్, ఇతర ప్రాంతాల్లోని కార్మికులకు కూడా బీఆర్ఎస్ హయాంలో కోట్ల విలువైన ఆర్డర్లు ఇవ్వడంతో.. వస్త్ర పరిశ్రమకున్న అన్ని సమస్యలు తొలగిపోయాయి. మళ్లీ కాంగ్రెస్ రాగానే చిమ్మ చీకట్లు అలుముకుంటున్నాయి.. పరిశ్రమను దెబ్బతీయడం తో పాటు.. కార్మికుల జీవితాలతో చెలగాటమాడే విధంగా వ్యవహరిస్తు న్న మీ కాంగ్రెస్ సర్కారు వెంటనే తన తీరు మార్చుకోవాలి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలుచేసిన కార్యక్రమాలను భేషజాలకు వెళ్లకుండా కొనసాగించాలి. మాప్రభుత్వం ఉన్నప్పుడు నెల నెలకు కార్మికుల ఖాతాల్లో నేరుగా సూమారు 3000 రూపాయాల వరకు పడేవి. ఈ ప్రభుత్వం వచ్చాకా చేనేత మిత్రా కార్యక్రమం అగిపోయింది. మూలన పడిన సాంచాలను తిరిగి తెరిపించడానికి.. పరిశ్రమకు రావాల్సిన రూ.270 కోట్లు బకాయిలను కూడా ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలి. మరోవైపు సొంత రాష్ట్రంలోని కార్మికులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వ పెద్దలు కమిషన్లకు కక్కుర్తి పడి.. తమిళనాడుకు, సూరత్ కు ఆర్డర్లు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్టు తెలుస్తోంది. రైతాంగ సంక్షోభాన్ని చూసినట్టు నేతన్నల సంక్షోభాన్ని కూడా రాజకీయ కోణంలో కాకుండా.. పేద బడుగు, బలహీన వర్గాలైన నేతన్నల కోణంలో ఆలోచించి పరిష్కరించాలని నేత కార్మికుల పక్షాన ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు వెల్లడించారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసీఆర్‌దే బాధ్యత..

(మొదటి పేజీ తరువాయి..)

వేత్తలు, ప్రముఖల ఫోన్లు కూడా ట్యాప్ అయ్యాయని కిషన్ రెడ్డి చెప్పారు. ప్రైవేట్ వ్యక్తుల ఫోన్లు ట్యాప్ చేసి డబ్బులు వసూల్ చేశారని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై ఉన్నతస్థాయి విచారణ జరగాలని కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ అంశంపై మాజీ సీఎం కేసీఆర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందులోనుంచి తప్పించుకునేందుకు కేటీఆర్ ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. ఈసీ రూల్స్ ను కేసీఆర్ బ్రేక్ చేశారని ఆరోపించారు. దీనిపై ఈసీ బాధ్యత కూడా ఉందన్నారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ పార్టీ గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ అంశాన్ని కోర్టు కూడా సుమోటోగా స్వీకరించాలన్నారు. పార్టీ ఫిరాయింపులను కాంగ్రెస్ ఎజెండాగా పెట్టుకుందని కిషన్ రెడ్డి విమర్శించారు. ఒక పార్టీలో గెలిచి మరో పార్టీలోకి వెళ్లడం కరెక్ట్ కాదన్నారు. గెలిచిన ఎమ్మెల్యేలు దమ్ముంటే రాజీనామా చేసిన పార్టీలు మారాలన్నారు. పార్టీ ఫిరాయింపులు, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై కిషన్‌రెడ్డి మండిపడ్డారు. తెలంగాణలో ఎన్నికల వేళ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం నాయకులను కలవరపెడుతోంది. తీగలాగితే డొంక కదిలినట్లు పోలీసుల దర్యాప్తు సాగుతోంది. ఇందులో ఎవరి ప్రమేయం ఉన్నా ఉపేక్షించేది లేదన్నారు. ప్రజాస్వామ్యం, వ్యక్తిగత స్వేచ్ఛను బిఆర్ఎస్ ప్రభుత్వం హరించివేసిందని ఆయన ఆరోపించారు. ఇందులో కేసీఆర్, ఆయన కుటుంబసభ్యుల పాత్రపై ఉన్నతస్థాయి విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ఈసీ కూడా దీన్ని సుమోటోగా స్వీకరించి, బీఆర్ఎస్ గుర్తుపై పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతిపక్ష నేతలకు చెందిన ఫోన్లను ఇష్టాను సారంగా ఫోన్ ట్యాంపింగ్ చేశారని ఆరోపించారు. ఈ వ్యవహారాలను కారణం ఎవరని.. నాటి ముఖ్యమంత్రిని ప్రశ్నిస్తున్నానన్నారు. ప్రైవేట్ వ్యక్తుల ఫోన్లను సైతం ట్యాంపింగ్ చేసి బెదిరింపులకు పాల్పడినట్లు ఇప్పుడు విచారణలో బయటపడుతోందన్నారు. ఇది చాలా తీవ్రమైన అంశమని పరిణామాలు కూడా తీవ్రంగా ఉంటాయన్నారు. దేశ భద్రత, సమగ్రతకు ముడిపడిన అంశమన్నారు. కేంద్ర హోంశాఖ కార్యదర్శి లిఖిత పూర్వకమైన అనుమతి తీసుకునే ట్యాప్ చేయాలని చెప్పారు. నేషనల్ ఇంటిగ్రిటికు సంబంధించి ఒక వ్యక్తి గురించి పూర్తి వివరాలు అందజేసి, అతను దేశ విద్రోహ శక్తులకు పాల్పడుతున్నట్లు అనుమానం ఉందని, దానికి సంబంధించిన పూర్తి వివరాలు హోం శాఖ కార్యదర్శికి పంపిన తర్వాతే ఫోన్ ట్యాపింగ్ చేయాలని తెలిపారు. కానీ వీటిని ఎక్కడా పాటించకుండా, చట్టాలను గౌరవించకుండా గత ప్రభుత్వం పాలన సాగించిందన్నారు. ఇది పూర్తిగా ప్రజాస్వామ్య విలువలకు విఘాతం కల్గించడమే అన్నారు. ఈ ఘటనపై రాష్ట్ర గవర్నర్‌ను కలిసి దర్యాప్తుకు ఆదేశించాల్సిందిగా కోరతానన్నారు. ఇందులో ఎవరు ఉన్నా కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై ఎన్నికల కమిషన్ కూడా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తానన్నారు.

## మండుతున్న ఎండలు

(మొదటి పేజీ తరువాయి..)

ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలకు చేరాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు భానుడు నిప్పులు కురిపిస్తున్నాడు. ఎండలకు తోడు వడగాలులు సైతం వీస్తుండడంతో జనం అల్లాడుతున్నారు. గురువారం అత్యధికంగా నల్గొండ జిల్లాలో నిడమనూరులో 43.5 డిగ్రీలకు ఉష్ణోగ్రత రికార్డయ్యింది. తీక్య తండా (నల్గొండ)లో 43.4, ధరూర్ 43.4, పెబ్బేరు (వనపర్తి) 43.3, నాంపల్లె (నల్గొండ) 43.2, కోరట్‌పల్లి (నిజామాబాద్) 43.1, బుగ్గబావి గూడ (నల్గొండ) 43.1, తిరుమలగిరి (నల్గొండ) 43.1, తెలిదేవరపల్లె (నల్గొండ) 43, వడ్డేపల్లి (జోగులాంబ) 43 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైనట్లు టీఎస్‌డీపీఎస్ పేర్కొంది. ఇదిలా ఉండగా.. రాగల మూడురోజుల గరిష్ఠ ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. శుక్ర, శనివారాల్లో భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. ఆదివారం రాష్ట్రంలో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాపాతం నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. ఉరుములు, మెరుపులు, గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో వర్షం అవకాశం ఉందని పేర్కొంది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. సోమవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలో ఈదురుగాలులతో వానలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ వివరించింది.

## తెలంగాణ భవన్‌కు వాస్తుదోషం

(మొదటి పేజీ తరువాయి..)

కార్యాలయంలోకి వెళ్లే గేటు. తెలంగాణ భవన్ తూర్పు అభిముఖంగా ఉండగా.. వాయువ్య దిశలో ఉన్న గేటు నుంచి రాకపోకలు సాగుతున్నాయి. అలా రావడం మంచిది కాదని, ఈశాన్యం వైపు ఉన్న గేటును ఇకనుంచి రాకపోకలకు వినియోగించాలని నిర్ణయించారు. అందుకు అనుగుణంగా ఈశాన్యం వైపు ఉన్న గేటును సిద్ధం చేస్తున్నారు. వాహనాల రాకపోకలు సాగించేందుకు వీలుగా ర్యాంపు నిర్మిస్తున్నారు. వీధి పోటును దృష్టిలో ఉంచుకొని లక్ష్మీనరసింహస్వామి చిత్రంతో కూడిన ఫ్లెక్సీని కూడా గేటుకు ఏర్పాటు చేశారు. రాకపోకలను వాయువ్యం నుంచి ఈశాన్యం వైపునకు మార్చడానికి ట్రాఫిక్ సమస్య కూడా కారణమని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12 వైపు వెళ్లే ప్రధాన రహదారి వెంట వాహనాల రాకపోకలు భారీగా పెరిగాయి. దీంతో తెలంగాణ భవన్‌లోకి వాహనాలు వెళ్లేందుకు ఇబ్బంది ఎదురవుతోంది. ఒకటి, రెండు వాహనాలు కూడా వాయువ్యం దిశలో ఉన్న గేటు వద్ద కాసేపు కూడా నిలిపి ఉంచే పరిస్థితి లేదు. దీంతో ఈశాన్యం గేటును రాకపోకలకు ఉపయోగించడం ద్వారా ట్రాఫిక్ సమస్యను అధిగమించవచ్చని భావిస్తున్నారు. వీటితో పాటు ప్రాంగణం లోపల కూడా అవసరమైన మేరకు స్వల్ప మార్పులు.. చేర్పులు చేస్తున్నారు.

## నల్లగొండలో త్రిముఖ పోరు

నేటి ఫోకస్ న్యూస్, నల్గొండ-ఏప్రిల్4:

నల్లగొండ పార్లమెంటుపై ప్రధాన రాజకీయ పార్టీలు ఫోకస్ పెట్టాయి. ఆయా ప్రధాన పార్టీలు ముమ్మర కసరత్తు అనంతరం అభ్యర్థులను ప్రకటించాయి. సిట్టింగ్ స్థానాన్ని కైవసం చేసుకునేందుకు అధికార కాంగ్రెస్ గట్టి పట్టుదలతో ఉంది. గతంలో ఇక్కడి నుంచి ఉత్త్ కుమార్ రెడ్డి ప్రాతినిధ్యం వహించారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో సూర్యాపేట మినహా ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ జెండా పాతింది. ఈ క్రమంలో ఎలాగైనా కాంగ్రెస్‌ను ఢీకొని సత్తా చాటాలని కమలం, గులాబీ పార్టీలు ఎత్తుకు పై ఎత్తులు వేస్తున్నాయి. నియోజకవర్గాల వారీగా ఆయా పార్టీల అంతర్గత సమావేశాలతో అభ్యర్థులు తమ పార్టీ శ్రేణుల్లో జోష్ నింపుతున్నారు. నల్గొండలో పాగా వేసేందుకు ప్రధాన పార్టీలు ముమ్మరంగా కసరత్తు చేస్తున్నాయి. గెలుపు కోసం అధికార, విపక్షాలు వ్యూహరచనల్లో మునిగి తేలుతున్నాయి. గతంలో మాదిరిగానే ఎంపి ఎన్నికల్లో అధికార పార్టీపై ఉన్న వ్యతిరేకత కలిసి వస్తుందని గులాబీ పార్టీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే తమ సిట్టింగ్ పార్లమెంటు స్థానాన్ని నిలబెట్టుకునేందుకు హస్తం పార్టీ నేతలు వ్యూహరచన చేస్తున్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు కుందూరు జానారెడ్డి తనయుడు కుందూరు రఘువీర్ రెడ్డి నల్గొండ కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగడంతో తండ్రి జానారెడ్డి, రఘువీర్ రెడ్డి సోదరుడైన నాగార్జునసాగర్ కాంగ్రెస్ నాయకుడు కుందూరు జయవీర్ రెడ్డి సైతం ఈ ఎన్నికలను ప్రతిష్మాత్మకంగా తీసుకు న్నారు. పార్లమెంటు పరిధిలోని సీనియర్లయిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డితో పాటు మిగతా ఎంఎల్‌ఎలంతా కలిసి తన కుమారుడు రఘువీర్ రెడ్డి గెలుపు నకు కృషి చేయాలని జానారెడ్డి కోరినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఆయా నియోజక వ ర్గాల పరిధిలో ముఖ్య కార్యకర్తలు, నాయకు లతో ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్నారు. పార్లమెంటు ఎన్నికల్లో 5 లక్షల మెజార్టీ లక్షంగా పని చేయాలని సీనియర్ నాయకుడు జానారెడ్డి పిలుపునిచ్చారు.

1952లో నల్గొండ పార్లమెంటు నియోజకవర్గ ఏర్పాటు తర్వాత మొదట్లో కమ్యూనిస్టులు గెలవగా ఆ తరువాత ఓసారి టిడిపి, అనంతరం కాంగ్రెస్ అభ్యర్థుల హవా కొనసాగింది. 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఉత్తమ్ కుమార్ రెడ్డి 25 వేల 682 ఓట్ల తేడాతో విజయం సాధించారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో నల్గొండ పార్లమెంటు పరిధిలోని ఏడు సెగ్మెంట్‌లకు గాను బిఆర్ఎస్ నుండి ఆరుగురు ఎంఎల్‌ఎలు గెలవగా, కాంగ్రెస్ నుంచి ఉత్తమ్ ఒక్కరే గెలిచారు. అయినప్పటికీ ఎంఎల్‌ఎగా గెలిచిన ఉత్తమ్ నల్గొండ ఎంపిగా పోటీ చేసి విజయం సాధించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో సీన్ రివర్స్ అయింది. నల్గొండ పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ సెంగ్మెంట్‌లకుగాను ఆరు సెగ్మెంట్‌లలో ఎంఎల్‌ఎ గెలవగా, ఒక్క సెంగ్మెంట్‌లో మాత్రమే బిఆర్ఎస్ విజయం సాధించింది. ఇదిలా వుంటే బిజెపి సైతం సంప్రదాయానికి భిన్నంగా హుజూర్‌నగర్ బిఆర్ఎస్ మాజీ ఎంఎల్‌ఎ శానంపూడి సైదిరెడ్డికి పార్టీ కండువా కప్పి నల్గొండ ఎంపి అభ్యర్థిగా ప్రకటించింది. ఈ అనూహ్య ప్రకటించడంతో ఆ పార్టీ శ్రేణులు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సైదిరెడ్డి 2018 అసెంబ్లీ ఎన్నికల్లో స్వల్ప తేడాతో కాంగ్రెస్ సీనియర్ నేత, పిసిసి మాజీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి చేతిలో ఓటమి పాలయ్యారు. అనంతరం లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తమ్ కుమార్ రెడ్డి నల్గొండ ఎంపిగా ఎన్నియ్యారు. దీంతో ఆయన తన హుజూర్‌నగర్ ఎంఎల్‌ఎ సీటుకు రాజీనామా చేయడంతో వచ్చిన ఉప ఎన్నికలో అదే పార్టీ నుంచి ఉత్తమ్ సతీమణి పద్మావతి రెడ్డిని బరిలో నిలిపారు. అయితే గులాబీ అభ్యర్థ్ధి శానంపూడి సైదిరెడ్డి దాదాపు 44 వేల మెజార్టీతో పద్మావతి రెడ్డిపై గెలుపొంది రికార్డు సృష్టించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థిగా ఓటమి చెందిన శానంపూడి సైదిరెడ్డిని బిజెపిలోకి ఆహ్వానించిన మరుచటిరోజే ఆయనకు నల్గొండ ఎంపి టికెట్ ప్రకటించారు. అయితే పార్టీ పెద్దల జోక్యంతో సైదిరెడ్డి పార్టీలోని అందరు నేతలను కలుపుకొని వెళ్ళడమే కాకుండా నల్గొండ మేనిఫెస్టోను రూపొందించే పనిలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇక అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కోల్పోయిన గులాబీ పార్టీకి కీలకమైన పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేయడానికి ముఖ్యమైన నాయకులందరూ ముఖం చాటేస్తున్నారు.

## ప్రపంచ పటంలో ఫణిగిరి

### - పురాతన నాణెళిలను పరిశీలించిన అధికారులు

నేటి ఫోకస్ న్యూస్, సూర్యాపేట-ఏప్రిల్4:

ప్రపంచ పటంలో నిలిచిన ఫణిగిరి బౌద్ధ క్షేత్రం తెలంగాణకే తలమానిక మని రాష్ట్ర పురావస్తు శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్ అన్నారు. సూర్యాపేట జిల్లా నాగారం మండలం ఫణిగిరి గ్రామంలో తవ్వకాల్లో ఇక్ష్వాకుల కాలంనాటి మట్టి పాత్రల్లో 3,730 సీసపు నాణెళిలు, రాతి పూసలు, సున్నపు రాతి విగ్రహాలు లభించాయి. ఈ సందర్భంగా వాటిని పురవాస్తు శాఖ డైరెక్టర్ భారతీ హోలికేరితో కలిసి గురువారం పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఫణిగిరి బౌద్ధ క్షేత్రానికి తెలంగాణలో చాలా ప్రాముఖ్యత ఉందన్నారు. భారతదేశంలో ఇంతవరకు ఎక్కడా దొరకని 3,730 నాణెళిలు లభించాయని తెలిపారు. ఈ నాణెళిలు ఒకవైపు ఏనుగు, మరోవైపు ఉజ్జయిని గుర్తులు కలిగి ఉన్నాయి. ఇక్ష్వాకుల కాలం నాటి నాణెములుగా క్రీ.శే 2-4 శతాబ్దంగా నిర్ధారించినట్లు చెప్పారు. వీటిని వెలికితీయడంలో ఆర్కియాలజీ సిబ్బంది శ్రమ వెలకట్టలేనిదని ప్రశంసించారు. మన చారిత్రక సంపదను న్యూయార్క్‌లో ప్రదర్శించిన విషయాన్ని గుర్తు చేశారు. ఇది మన సంపద. దీనిని కాపాడాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. ఈ నేలలో ఉన్నటువంటి అమరావతి, నేలకొండపల్లి వంటి బౌద్ధ సంపద ఎక్కడ కూడా లేదన్నారు. చాడలో కూడా తవ్వకాలు ప్రారంభించామని పేర్కొన్నారు. ఫణిగిరి వైభవాన్ని చూసేందుకు విదేశీ పర్యాటకులు ఎంతో ఆసక్తి కనబరుస్తున్నారని పేర్కొన్నారు.

# ఊసరవెల్లి కంటే త్వరగా
# రంగులు మార్చే వ్యక్తి రేవంత్ రెడ్డి

- **12శాతం ఉన్న మాదిగలకు ఒక్క పార్లమెంటు సీటు ఇవ్వని సీఎం**
- **మల్కాజ్‌గిరిలో కాంగ్రెస్, బిఆర్ఎస్‌కు డిపాజిట్ కూడా రాదు**
- **ఈటెల రాజేందర్**

**ఫోకస్ న్యూస్, కంటోన్మెంట్:**

ఎన్నికల సమయంలో అమలు కానీ వాగ్దానాలు ఇచ్చి ప్రజలను మభ్యపెట్టి పబ్బం గడుపుకోవడం సీఎం రేవంత్ రెడ్డికి చెల్లుతుందని, రేవంత్ రెడ్డి పై మల్కాజ్ గిరి పార్లమెంట్ బిజేపి పార్టీ అభ్యర్థి ఈటల రాజేందర్ ఘాటైన వాక్యాలు చేశారు. కంటోన్మెంట్ నియోజకవర్గం 6. 7వ వార్డులో ఎన్నికల ప్రచారంలో భాగంగా, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు బిజెపి పార్టీ సీనియర్ నాయకులు సదా కేశవరెడ్డి నివాసంలో విలేకరుల సమావేశంలో ఈటల రాజేందర్ మాట్లాడుతూ... ఊసరవెల్లి కంటే త్వరగా రంగులు మార్చే వ్యక్తి సీఎం రేవంత్ రెడ్డి అని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మల్కాజ్ గిరి తన స్థానం అంటూ చెప్పుకోవడం సిగ్గుచేటు అని అన్నారు. మల్కాజ్ గిరి సీఎం రేవంత్ రెడ్డి తాత జాగీరు కాదని, మల్కాజ్ గిరి ప్రజల జాగీరు అని అన్నారు. మల్కాజ్ గిరి పార్లమెంటు ఎంపీగా ఉండి ఏమి అభివృద్ధి చేయలేదని, కనీసం ఒక కార్పొరేటర్, ఒక కౌన్సిలర్, ఒక ఎమ్మెల్యే లను కూడా గెలిపించుకోలేకపోయాడని హెద్దేవా చేశాడు. 12 శాతం ఉన్న మాదిగలకు ఒక్క పార్లమెంటు సీటు కూడా కేటాయించకపోవడంపై మాదిగలకు ప్రధానమైన వ్యతిరేకమైన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని తెలిపారు. ఒక పార్టీ గుర్తుపై గెలిచి ఆ పార్టీకి రాజీనామా చేయకుండా, వేరే పార్టీలో చేరితే రాళ్లతో కొట్టి చంపాలన్న రేవంత్ రెడ్డి ఇతరులను కాంగ్రెస్ పార్టీలో ఎలా చేర్చుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఈటెల రాజేందర్ అన్ని వర్గాల, అన్ని ప్రాంతాల మనిషినని మల్కాజ్ గిరిలో బిజెపి పార్టీ జెండా ఎగరవేసి నియోజకవర్గం ప్రజల సమస్యలన్నీ తీరుస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ బిజెపి పార్టీ అభ్యర్థి ఆరూరి రమేష్, బిజెపి పార్టీ సీనియర్ నాయకుడు డాక్టర్ టి.ఎన్ వంశీ తిలక్, సదా కేశవరెడ్డి, భానుక నర్మద మల్లికార్జున్, సుస్మిత శంకర్ రావు, పిట్ల నాగేష్, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# వృధా ఖర్చులు చేయకుండా పేదలకు సాయం చేయడం సంతోషాన్నిస్తుంది: తావిష్ జైన్

- **కన్న ఊరు ప్రభుత్వ పాఠశాల అండగా ఉండటం అభినందనీయం**
- **బోయిన్‌పల్లి బాపూజీనగర్ ప్రైమరి ప్రభుత్వ పాటశాలలో విద్యార్థులకు తినుబండారాలు అందిస్తున్న తావిష్ జైన్‌తో జంపన్న ప్రతాప్**

**ఫోకస్ న్యూస్, కంటోన్మెంట్:**

కన్నాఊరు ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు అండగా ఉండటం అభినాదనీయమాని, యువత వృధాఖర్చులు మాని ప్రభుత్వ పాటశాలలో చదువుకునే విద్యార్థులకు సహకరించాలని, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన్న ప్రతాప్ తెలిపారు. ప్రభుత్వ పాటశాలలో చదువుకునే విద్యార్థులలో అధిక శాతం మంది నిరుపేదల కుటుంబాలకు చెందినవారి పిల్లలు వుంటారని, కాబట్టి బోయినపల్లి జైన్ సమాజ్ స్వచ్ఛంధ సంస్థ అధ్వర్యంలో తమ కుటంబసభ్యుల ఇండ్లలో జరిగే ప్రతి శుభకార్యాలకు ప్రభుత్వ పాటశాలలో చదువుకునే విద్యార్థులకు తమకు తోచిన విధంగా సహాయపడుతూ వారితో సరదాగ గడపటం జైన్ సమాజ్ వారి ఆనవాయితి అని తావిష్ జైన్ అన్నారు. గురువారం నాడు తన పుట్టినరోజు సందర్భంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో జరుపుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. బోయినపల్లి జైన్ సమాజ్ స్వచ్ఛంధ సంస్థ నిర్వాహకురాలు తావిష్ జైన్ పుట్టినరోజు సందంధర్బంగా బోయినపల్లి బాపూజీనగర్ ప్రభుత్వ పాటశాలలో చదువుతున్న విద్యార్థులకు తినుబండారాల తోపాటు కేక్ ను పంచిపెట్టారు. పుటిన రోజు వేడుకలు జరుపుకోకుండా వృధా ఖర్చులు మానుకోని నిరుపేద విద్యార్థులకు అండగా నిలవాలనే సంకల్పంతో చేస్తున్న పనులు తనకు ఎంతో సంతోషాన్ని ఇస్తున్నాయని అన్నారు. ఈ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు ఎల్లప్పుడు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాటశాల ప్రిన్సిపాల్ ఆశీర్వాదం, ఉపాధ్యాయులు శ్రీనివాస్, ప్రేమలత , పద్మావతి లతోపాటు స్థానికులు, ప్రభుకుమార్ గౌడ్, పవన్, తదితరులు పాల్గొన్నారు.





# విద్యార్థులకు వీడ్కోలు..

- విజేతలకు బహుమతులు ప్రధానం..

**వనపర్తి ప్రతినిధి నేటి ఫోకస్ న్యూస్:**

వనపర్తి జిల్లా కేంద్రంలో గల డబ్ల్యుసిసిఎం డిగ్రీ కళాశాలలో మూడవ సంవత్సరం విద్యను పూర్తి చేసుకున్న విద్యార్థులకు కళాశాల విద్యార్థులు అధ్యాపక బృందం గురువారం ఘనంగా వీడ్కోలు పలికారు. కళాశాల ప్రిన్సిపాల్ గుండ్ల లక్ష్మారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఫేర్వెల్ పార్టీకి విద్యార్థులు హాజరై కళాశాలలో గత మూడేళ్లుగా చదువుకుని కళాశాలను వదిలి వెళుతున్న జ్ఞాపకాలను గుర్తుచేసుకొని కన్నీటి పర్యంతమయ్యారు. అనంతరం మొదటి, మూడవ, ఐదవ సెమిస్టర్ ఫిబ్రవరి 2024 ఫలితాలలో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ లక్ష్మారెడ్డి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థాయిలో ఉండేందుకు తమ కళాశాల తొలి మెట్టు అని అన్నారు. కళాశాలలో నాణ్యమైన విద్యతో పాటు సంస్కృతి సాంప్రదాయాలను నేర్చుకొని వెళతారన్నారు. అనంతరం మొదటి బహుమతి ఎన్. కీర్తి, బీకాం 9.48 గ్రేడ్ సాధించగా ద్వితీయ బహుమతి ఆయేషా తబస్సుం ఎంఎస్ సి కంప్యూటర్స్ 9.40 గ్రేడ్, తృతీయ బహుమతి పి. ఆస్మా బి జెడ్ సి 9.36 గ్రేడ్ సాధించగా మరికొందరికి కన్సోలేషన్ ప్రైజులు అందజేసినట్లు ఆయన తెలిపారు.

## సజీవపు రుజువు

నన్ను నేను జయిస్తున్నాను..
నూతనంగా ఉదయిస్తున్నాను..
కాలగర్భంలో కలిసిన
లొసుగులను, ముసుగులను
బహిర్గతపరుస్తున్నాను..
నిశీధిలో దాగివున్న
నిశ్శబ్ధ విప్లవాల్ని
విశదపరుస్తూ వివరిస్తున్నాను.
మూఢత్వపు జఢత్వం
మతతత్వపు మౌఢత్వం
కులతత్వపు క్రూరత్వం
అసమానతల అర్థరాహిత్యం
అన్నింటా.. అమానుష
సంఘటనలను
అనునిత్యం భరిస్తూ..
నిబద్ధపు ప్రబుద్ధుడినై
సత్యాన్నే ప్రవచిస్తున్నాను
సగర్వంగా జీవిస్తున్నాను..
సమాజాన్ని నడిపిస్తున్నాను..
కాలగర్భంలో కలిసిన
సత్యాన్ని శోధిస్తున్నాను..
కాలాన్ని శాసించే
మానవున్నె వికసిస్తున్నాను..

– కృష్ణ పొట్టపింజర
ప్రభుత్వ ఉపాధ్యాయుడు,
జీయూపీఎస్ గోరీలపాడుతండా
కూసుమంచి, ఖమ్మం.



# మాలల మద్దతు బిఆర్ఎస్‌కే..

- **ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అందరివాడు!**
- **బిఆర్ఎస్ జిల్లా యువ నాయకుడు గోరేటి సూరి!!**

**నాగర్ కర్నూల్ ప్రతినిధి జయశంకర్ ( నేటి ఫోకస్ ఏప్రిల్ 4)**

మాలల మద్దతు బి ఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కు .ఉంటుందని టిఆర్ఎస్ పార్టీ జిల్లా యువ నాయకుడు గోరేటి సూరి అన్నారు నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అందరివాడని మాల మాదిగల తో పాటు అగ్రవర్ణాల పేదలకు కూడా విద్యను అందించిన మహానుభావుడనీ కొనియాడారు బిఆర్ఎస్ అభ్యర్థి. ఆర్ ఎస్ పి .గెలిస్తే కేంద్రం నుంచి అధిక నిధులు తీసుకొచ్చేందుకు. బహుజనుల గొంతై పార్లమెంట్లో మన వాణి వినిపించే .అవకాశం ఉంటుందన్నారు బీద విద్యార్థులు ఉన్నత స్థాయి చదువు చదివేందుకు అవకాశాలు కల్పిస్తాడని అన్నారు కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవి దాదాపు రెండుసార్లు నాగర్ కర్నూల్ ఎంపీగా గెలిచి ఈ ప్రాంత అభివృద్ధి గురించి ఏనాడు మాట్లాడని వ్యక్తి అని విమర్శించారు కుల ఫీలింగ్ లో మాలలు మల్లు రవికి ఓటు వేయొద్దని అభివృద్ధి చేసే బహుజన మేధావి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కు మాలలు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. లేనిపక్షంలో నాగర్ కర్నూల్ అభివృద్ధి చెందదని ఆవేదన వ్యక్తం చేశారు ఈనెల 7న తేజ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్ లో జిల్లా స్థాయి టిఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పాల్గొంటారని జిల్లాలోని బిఆర్ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు ఈ కార్యక్రమంలో మిద్దె బాలస్వామి ఆలూరి శ్రీశైలం మిద్దె మన్యం గద్ద మధు ఆలూరి శీను తదితరులు పాల్గొన్నారు.



# ఉమ్మడి కుటుంబాల ఊసే లేదు..
## ఉన్న ఒంటరి కుటుంబాల్లో ఆప్యాయతలే లేవు..

ఇటీవలి కాలంలో మరి ముఖ్యంగా వైట్ కాలర్ జాబ్ చేసే ప్రతి కుటుంబం కూడా ఒకచోట ఉండే అవకాశాలున్నప్పటికిని, ఒంటరితనం బతుక్కు అలవాటు పడ్డ వైనం ఓ చారిత్రక సత్యం.

నేటికీ శ్రామిక కుటుంబాల్లో సగానికి పైగా కుటుంబాలు ఉమ్మడి కుటుంబాలుగా ఉంటున్నాయి. కారణాలేవైనా కావచ్చు వారు మరోచోట ఉండాలంటే ఇల్లు వసతి కావాలి. అందుకు వారికున్న ఆర్థిక స్తోమత ప్రధాన అడ్డంకిగా మారుతున్నది.

మారుతున్న నేటి సమాజమంతా ఆర్థికఛత్రంలో కొట్టుమిట్టాడుతోంది. వారికి డబ్బే ప్రపంచం అయ్యిది.

బంధాలు, అనుబంధాలు గౌరవాలు, ప్రతిదీనూ ఆకోణంలోనే ముడివడి ఉన్నాయి.మర్యాదలు, అతిథి సత్కారాలు సైతం డబ్బు చుట్టూరా తిరగాడుచున్నవి.

రక్తసంబంధీకుల్లోనూ ఇదే వరుస కనబడుతోంది. వారికి బాల్యదశ నుండి వైవాహికదశ వరకు తమ తల్లి,తండ్రి ద్వారా అందిన చేయూతపై సరియైన అవగాహన లేకపోవడం కారణంగా,ఆ దిశగా వారు ఆలోచన చేయకపోవడం కారణంగా, అంతేకాకుండా ఆ తీరిక కూడా వారికి లేకపోవడమూ ఓ కారణం అని చెప్పవచ్చు.

ఏ ఒక్క కుటుంబాన్నో అనడం కాదు కానీ ఈ విషయంలో సమాజంలో కోకొల్లలుగా ఉదాహరణలు, పోలికలు వారికి నిత్యం బలం చేకూర్చే అంశాలుగానే ఉన్నాయి. బాగా అభివృద్ధి చెందిన నేటి ఆధునిక సాంకేతిక వ్యవస్థల్లో బంధుత్వాల మధ్య నిడివిని బాగా తగ్గించే సావకాశమూ ఉంది. ఎటోచ్చీ మనసుంటే మార్గముంటుందన్నట్లుగా యోగక్షేమాలదిశగా, సమాచారం ఇచ్చిపుచ్చుకునే దిశగా, అడుగులు పడటం లేదన్నదే ప్రధాన చర్చనీయాం.

వృద్ధాప్యంలో ఆలన పాలన చూసుకోవాల్సిన వారి సంతానం కనీసం పరామర్శకు దూరమైన సందర్భాలు ఎన్నో సాక్షాత్కరిస్తున్నాయి.

ఈ కోణంలో వారి కుటుంబపెద్దల మానసిక క్షోభను ఒకింత దూరం చేయాల్సినవారే ఆ కుటుంబ సభ్యులే కనీసం ఫోన్ ద్వారా నిరంతరాయంగా పలకరించకపోవడమనే సంస్కారాన్ని మనం ఎలా నిర్వచిద్దాం?

క్షణం తీరికలేని రాబడి కోసమే పొద్దస్తమానం ఆలోచించడంలో గల ఔచిత్యమేమిటో!ఓ డాలర్ల ప్రశ్నగా చెప్పుకోవచ్చు.

ఉన్నత చదువులు చదివించి వారు ఉన్నతులుగా ఎదగడానికి కావలసిన సకల సౌకర్యాలను అందించిన తల్లిదండ్రులను తప్పుపట్టాలా? ఎదిగిన కొద్దీ ఒదిగి ఉండలేని తమ సంతానాన్ని తప్పుపట్టాలా?

కుటుంబంలో నూతనంగా చేరిన నూతన సభ్యురాలిని తప్పుపట్టాలా? ఒకరిపై ఒకరు ఆ నింద వేసుకుంటూ కాలం గడపటం ఇరు కుటుంబాలకు ఆరోగ్యం మాత్రం కాదు సుమా!

మనిషిగా జన్మించిన మనం చెప్పించుకునే ధోరణికి స్వస్తి పలికి సరైనా అవగాహన దిశగా అడుగులు వేయాలని ఆశిద్దాం !

– పరాంకుశం రఘు నారాయణ
తొర్రూరు, మహబూబాబాద్ జిల్లా
చరవాణి సంఖ్య: 9949749987



# ఆర్గానిక్ ప్రమాద బాధితులకు హరీష్ పరామర్శ

- **కుటుంబాలకు 50లక్షలు ఇవ్వాలని డిమాండ్**

**నేటి ఫోకస్ న్యూస్, సంగారెడ్డి–ఏప్రిల్4:**

ఆర్గానిక్ పరిశ్రమ పేలుడులో క్షతగాత్రులై ఎంఎన్ఆర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, సునీత లక్ష్మారెడ్డి, మెదక్ భారాస అభ్యర్థి వెంకటరామరెడ్డి పరామర్శించారు. మృతుల కుటుంబాలకు రూ.50 లక్షలు, క్షతగాత్రులకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. మృతి చెందినవారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలన్నారు. బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సంస్థ యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. తక్షణమే ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి క్షతగాత్రులు ఎక్కడెక్కడున్నారో లెక్కతేల్చాలన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, ఇలాంటి ఘటనలు మరోసారి జరగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రమాద ఘటనకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని, యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, మంత్రుల పరామర్శలు, కంటి తుడుపు చర్య లు పనికిరావని చెప్పారు. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలోని చందాపూర్ గ్రామ శివారులో ఎస్ బి ఆర్గానిక్ రసాయన పరిశ్రమలో బాయిలర్ ఆయిల్ రియాక్టర్ పేలి సంస్థ డైరెక్టర్ సహా ఆరుగురు మృతిచెందిన విషయం తెలిసిందే.

# పోలీసులు విస్తృత తనిఖీలు

- **25లక్షల నకిలీ నోట్లు పట్టివేత**

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్–ఏప్రిల్4:**

రంగారెడ్డి జిల్లా బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రూ. 25 లక్షల నకిలీ నోట్లను మహేశ్వరం ఎస్ఓటి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల తరుణంలో ఇలా నకిలీ నోట్లు పట్టుబడడం కలకలం సృష్టించుతోంది. వాహనాలు తనిఖీ చేస్తుండగా బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ రూ. 25 లక్షల నకిలీనోట్లు దొరికాయి. వాటిని మహారాష్ట్ర నుంచి తీసుకొస్తున్నట్లు, నలుగురు నిందితులను అరెస్టు చేశారు.

# అడుగంటిన జలాలు

- **పొదుపుగా వాడుకుంటేనే మనుగడ: వివేక్**

**నేటి ఫోకస్ న్యూస్, పెద్దపల్లి–ఏప్రిల్4:**

తెలంగాణలో తక్కువ వర్షపాతం కారణంగా భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయని.. అందరూ నీటిని పొదుపుగా వాడుకోవాలని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. ఈ సంవత్సరం 60శాతం వర్షాలు తక్కువ పడ్డాయని...అందుకే భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయని చెప్పారు. దీంతో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. అందరూ నీటిని పొదుపుగా వాడుకోవాలి.. ముంబై లాంటి నగరాల్లో కూడా నీటి కష్టాలు తప్పడం లేదని ఆయన చెప్పారు. గురువారం జిల్లాలోని ధర్మారం మండలం కమ్మరిఖాన్ పెట్ ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో కలిసి ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి,పెద్దపల్లి పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీ కృష్ణ, మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామ కృష్ణ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేక్ మీడియాతో మాట్లాడుతూ.. ప్రజల సమస్యల పరిష్కారం కోసం అందరం కలిసికట్టుగా పని చేస్తామని చెప్పారు. ఎల్లమ్మ తల్లి ఆశీస్సులతో అందరూ బాగుండాల న్నారు. సంవత్సరం క్రితం ఆలయ అభివృద్ధి కోసం గౌడ కులస్తులు తనతో చర్చించారని... వాళ్లు తనను ఎప్పుడు మర్చిపోలేదన్నారు. ఆలయాన్ని అద్భుతంగా నిర్మించారని.. ఆలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మనకు బాధలు వస్తే దేవుడిని మొక్కుతం, పూజలు చేస్తాం.. ఇలాంటి సాంస్కృతి ఏ దేశంలో లేదని అన్నారు. నాలుగేండ్లు మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డితో కలిసి ప్రజల కోసం పనిచేశామన్నారు. ఎల్లమ్మ తల్లి ఆశీస్సులతో అప్పుల రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అభివృద్ధి చేస్తామని వంశీకృష్ణ అన్నారు.

# రాహుల్ ఆస్తుల విలువ 20కోట్లు

- **సొంత ఇల్లు, వాహనం లేదని అఫిడవిట్**

**నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ–ఏప్రిల్4:**

కాంగ్రెస్ సీనియర్ రాహుల్ గాంధీ లోక్‌సభ ఎన్నికల్లో వయనాడ్ నుంచి పోటీ చేయనున్నారు. బుధవారం ఆయన నామినేషన్‌తో పాటు ఆఆస్తులకు సంబంధించిన అఫిడవిట్ దాఖలు చేశా రు. ఆయన మొత్తం ఆస్తుల విలువ రూ.20 కోట్లు. సొంత వాహనం,ఫ్లాట్ లేవని ఆ అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఈ రూ.20 కోట్లలో చరాస్తులు రూ.9.24 కోట్లు. ఇందులో రూ.55 వేల నగదు, రూ.26.25 లక్షల బ్యాంకు డిపాజిట్‌లు, బాండ్‌లు, షేర్‌ల విలువ రూ.4.33 కోట్లు, మ్యూచ్యువల్ ఫండ్స్ విలువ రూ.3.81 కోట్లు, రూ.15.21 లక్షల విలువైన గోల్డ్ బాండ్స్, రూ.4.20 లక్షల విలువైన బంగారు ఆభరణాలున్నట్టు అఫిడవిట్‌లో రాహుల్ గాంధీ ప్రస్తావించారు. ఇక స్థిరాస్తుల విషయానికొస్తే...వీటి విలువ రూ.11.15 కోట్లుగా ఉంది. ఢిల్లీలోని మెహరౌలీలో వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమిని రాహుల్‌తో పాటు ప్రియాంక గాంధీ కలిసి కొనుగోలు చేశారు. గురుగావ్‌లో సొంతగా ఆఫీస్ ఉందని అఫిడవిట్‌లో తెలిపారు. ప్రస్తుతం ఈ భూమి విలువ రూ.9 కోట్లుగా ఉంది. అయితే...ఈ భూమి వారసత్వంగా వచ్చినట్టు వివరించారు. తనపై ఉన్న పోలీస్ కేసుల గురించీ అందులో ప్రస్తావించారు. ఇందులో ఓ పోక్సో కేసు కూడా ఉంది. సోషల్ మీడియాలో అత్యా చార బాధితారులి కుటుంబ సభ్యుల వివరాలు బయట పెట్టినం దుకు ఈ కేసు నమోదైంది. బీజేపీ నేతలు వేసిన పరువు నష్టం దావా కేసులూ ఆయనపై ఉన్నాయి. 2019 లోక్‌సభ ఎన్నికల్లోనూ రాహుల్ గాంధీ వయనాడ్ నుంచే పోటీ చేసి గెలుపొందారు. ఈ సారి ఆయనకు పోటీగా సీపీఐ నేత అన్నీ రాజా, బీజేపీ చీఫ్ కే సురేంద్రన్ బరిలోకి దిగారు.

# స్టీఫెన్ రవీంద్రపై డిఎస్పీ ఫిర్యాదు

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్–ఏప్రిల్4:**

సైబరాబాద్ మాజీ సీపీ, ప్రస్తుత హోంగార్డ్స్ ఐజీ స్టీఫెన్ రవీంద్రపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కమాండ్ కంట్రోల్ డీఎస్పీ గంగాధర్ ఫిర్యాదు చేశారు. తాను నార్సింగి సీఐగా ఉన్నప్పుడు భూ వివాదంలో జోక్యం చేసుకున్నానని ఆరోపిస్తూ రవీంద్ర సస్పెండ్ చేశారని పేర్కొన్నారు. భూ కబ్జాదారులతో చేయి కలిపి, ఎలాంటి విచారణ చేయకుండానే తనను సస్పెండ్ చేశారన్నారు. దీనివల్ల పదోన్నతి అవకాశం కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేశారు. పదోన్నతి అవకాశం పరిశీలించాలని హైకోర్టు ఆదేశించినప్పటికీ.. న్యాయస్థానం ఉత్తర్వులను స్టీఫెన్ రవీంద్ర లెక్క చేయలేదని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. పలువురు కిందిస్థాయి అధికారులను ఆయన ఇబ్బంది పెట్టారంటూ.. ఫిర్యాదు కాపీని సీఎస్ శాంతి కుమారి, డీజీపీ రవి గుప్తా, హోంశాఖ, డీవోపీటీకి పంపించారు.

# తల్లికాబోతున్న బాలీవుడ్ నటి ఆర్తి చాబ్రియా



**బాలీవుడ్ నటి ఆర్తి చాబ్రియా** 41 ఏళ్ళ వయసులో తల్లి కాబోతుంది. తాను తల్లి కాబోతున్నట్లు బేబి బంప్స్ ఫొటోలను సోషల్ మీడియా వేదికగా పంచుకుంది ఈ నటి. లజ్జ, ఆవారా పాగల్ దీవానా, షూటౌట్ ఎట్ లోఖండ్‌వాలా, మిలేంగే మిలేంగే, పార్ట్‌నర్ లాంటి సూపర్ హిట్ సినిమాల్లో నటించిన ఈ భామ ఒకరికి ఒకరు సినిమాతో తెలుగు ఇండ్రస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత ఇంట్లో శ్రీమతి వీధిలో కుమారి, గోపి ? గోడమీద పిల్లి.. చింతకాయల రవి లాంటి పలు సినిమాల తో మెప్పించింది. అయితే 2019లో చాటడ్ అకౌంటెంట్ విశారద్ బీడస్సిని పెళ్లి చేసుకుని ఆస్ట్రేలియా వెళ్ళిపోయింది ఈ భామ. ప్రస్తుతం ఆస్ట్రేలియాలోనే నివసిస్తుంది. ఇదిలావుంటే తాజాగా తాను తల్లి కాబోతున్నట్లు ఫొటోలను పంచుకుంది. ఇక లేట్ వయసులో ఆర్తి తల్లి కావడంతో ఆమె అభిమానులు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

# నేడు ఫ్యామిలీ స్టార్ విడుదల

**టాలీవుడ్ నటుడు విజయ్ దేవరకొండ** మృణాళ్ ఠాకూర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'ఫ్యామిలీ స్టార్' పరశురాం ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా శుక్రవారం ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే విడుదల తేదీ దగ్గరపడుతుండటంతో మేకర్స్ ప్రమోషన్స్ మొదలుపెట్టిన విషయం తెలిసిందే. ఇప్పటికే సినిమా నుంచి టీజర్‌తో పాటు ట్రైలర్ విడుదల చేయగా మంచి రెస్పాన్స్ దక్కించుకుంది. ఇదిలావుంటే తాజాగా ఈ చిత్రం సెన్సార్ పూర్తి చేసుకుంది. సెన్సార్ బోర్డు సభ్యులు ఈ సినిమాకు యు/ఏ సర్టిఫికేట్‌ను జారీ చేశారు. ఇక రన్‌టైం విషయానికి వస్తే.. ఈ మూవీ 150 నిమిషాలు ఉన్నట్లు చిత్రయూనిట్ వెల్లడించారు. ఈ విషయాన్ని తెలుపుతూ.. 150 నిమిషాల సంపూర్ణ వినోదాన్ని అందించడానికి 'ఫ్యామిలీ స్టార్' రేపు మీ ముందుకు వస్తున్నాడు. అంటూ మేకర్స్ రాసుకొచ్చారు. మరోవైపు ఈ సినిమా అడ్వాన్స్ బుకింగ్స్ కూడా స్టార్ట్ అయినట్లు ప్రకటించింది. ఇక ఈ సినిమాలో రష్మిక మందన్న అతిథి పాత్రలో నటించగా, దివ్యాంశ కౌశిక్ ఒక ముఖ్యమైన పాత్రను పోషించింది. దిల్ రాజు ఈ చిత్రాన్ని భారీ ఎత్తున నిర్మిస్తున్నారు.




# అసూయ పుట్టిస్తున్న అనసూయ ఫొటోలు

**అనసూయ ఏమి చేసినా వైరల్** అవుతూ ఉంటుంది. ఏదైనా మాట్లాడినా లేక ఫోటో ఏదైనా పెట్టినా సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతూ ఉంటాయి. ఇప్పుడు ఆమె తాజాగా తన ఫోటోలు అభిమానుల కోసం తన సామాజిక మాధ్యమంలో షేర్ చేశారు, అవి వైరల్ అవుతూ వున్నాయి. అనసూయ సామాజిక మాధ్యమాల్లో ఎటువంటి ఫోటో పెట్టినా వైరల్ అవుతూనే ఉంటుంది. అందులోకి కొంచెం అందంగా, గ్లామర్ గా వుండే ఫోటోలు పెడితే ఇంకా చెప్పనక్కరలేదు, అవి ఇంకా వైరల్ అవుతాయి. కొన్ని రోజుల క్రితం అనసూయ ఒక బ్యూటీ సలోన్ ప్రారంభోత్సవానికి వెళ్లారు. అక్కడ సలోన్ ఓపెన్ చేసినప్పుడు ఫోటోలు వైరల్ అయిన సంగతి తెలిసిందే. ఆ తరువాత అనసూయ తన ఫోటోలు కూడా కొన్ని తన సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. అవి కూడా ఇప్పుడు బాగా వైరల్ అవుతున్నాయి. అలాగే ఈమధ్య ఒక యూట్యూబ్ ఛానెల్ కి ఇంటర్వ్యూ కూడా ఇచ్చిన అనసూయ తన సామాజిక మాధ్యమాల్లో ఎందుకు ఏడుస్తున్న వీడియోస్ పెట్టవలసి వచ్చిందో కూడా వివరణ ఇచ్చారు. అలాగే ఈమధ్యనే ఆమె నటించిన 'రజాకార్' సినిమా విడుదలై పాజిటివ్ రివ్యూస్ తెచ్చుకుంది. అందులో అనసూయ ఒక పాటలో కనిపించడమే కాకుండా, ఆ తరువాత వచ్చిన ఒక గొప్ప సన్నివేశంలో నటించి మెప్పించింది. ఈ సినిమాలో ఆమె పాత్ర నిడివి చాలా చిన్నదే అయినా అనసూయకి పేరు మాత్రం బాగా వచ్చింది. ఇప్పుడు 'పుష్ప 2' సినిమాలో కూడా అనసూయ కనబడబోతోంది. ఇందులో ఒక నెగటివ్ పాత్రలో అనసూయ కనపడుతుంది. 'పుష్ప' మొదటి భాగంలో అనసూయ పాత్ర కన్నా, రెండో పార్టులో ఇంకా ఎక్కువ ఉంటుంది అని అంటున్నారు. సుకుమార్ ఈ సినిమాకి దర్శకుడు, అల్లు అర్జున్ కథానాయకుడు. రష్మిక మందన్న కథానాయిక. ఆగస్టు 15న ఈ సినిమా విడుదలవుతోంది. ఏప్రిల్ 8న కథానాయకుడు అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా నుండి ఒక టీజర్ వస్తుంది అని ఈ చిత్ర నిర్వాహకులు ప్రకటించారు, ఈ సినిమా కోసం అర్జున్ అభిమానులు ఆతృతగా ఎదురు చూస్తున్నారు. మరి ఈ టీజర్ లో ఈ సినిమాలో వున్న మిగతా పాత్రలు అంటే అనసూయ, రావు రమేష్, ఫహద్ ఫాజిల్ లను కూడా చూపెడతారా, లేక ఒక్క అల్లు అర్జున్ నే చూపిస్తారా అనేది ఏప్రిల్ 8న తెలుస్తుంది.





# స్వయంభులో నభానటేశ్ స్టిల్ విడుదల

టాలీవుడ్ యువ కథానాయకుడు నిఖిల్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'స్వయంభూ'. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాకు భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తుండగా.. ఠాగూర్ మధు సమర్పణలో పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్‌పై భువన్, శ్రీకర్ నిర్మిస్తున్నారు. ఇక ఈ చిత్రంలో సంయుక్తా మేనన్ కథనాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ మూవీ కోసం సంయుక్తా మేనన్ హార్స్ రైడింగ్ కూడా నేర్చుకుంటుంది. అయితే తాజాగా ఈ సినిమా సెట్‌లోకి మరో స్టార్ హీరోయిన్ ఎంట్రీ ఇచ్చింది. ఇప్పటికే నభా నటేష్ ఈ సినిమాలో నటిస్తున్నట్లు వార్తలు వచ్చిన విషయం తేలిసిందే. ఇక తాజాగా నభా నటేష్ 'స్వయంభూ' సెట్స్‌లోకి ఎంట్రీ ఇచ్చినట్లు మేకర్స్ వెల్లడించారు. ఈ సందర్భంగా నభా సెట్స్‌లోకి అడుగుపెట్టిన వీడియోను ఎక్స్ వేదికగా పంచుకున్నారు. కన్నడ నటి నభానటేష్ (ఔజీశిరజీ ఔజీబి,బర) 'నన్ను దోచుకుందువటే' చిత్రంతో టాలీవుడ్‌కు పరిచయమయ్యారు. రామ్‌పోతినేని హీరోగా నటించిన 'ఇస్మార్ట్ శంకర్' సినిమాతో విజయాన్ని అందుకున్నారు. 'సోలో బ్రతుకే సో బెటర్', 'డిస్కో రాజా', వంటి చిత్రాల్లో నటించిన ఆమె దాదాపు మూడేళ్లుగా సినిమాలకు దూరంగా ఉన్నారు. ఇటీవల టాలీవుడ్ యంగ్ హీరో నిఖిల్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న 'స్వయంభూ'చిత్రంలో మరో నాయికగా నభా నటేష్ పేరుని ఖరారు చేశారని వార్తలొచ్చాయి. ఆ వార్తలు నిజమేనంటూ తాజాగా సినిమాలో ఆమె లుక్‌కి సంబంధించిన వీడియోను విడుదల చేసిన చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. యుద్ధ నేపథ్య కథాంశంతో రూపొందుతోన్న ఈ యాక్షన్ డ్రామాలో నిఖిల్ ఓ యోధుడి పాత్రలో కనువిందు చేయనున్నారు. ఇందుకోసం ఆయన మార్షల్ ఆర్ట్స్, గుర్రపు స్వారీ తదితర విద్యల్లో ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు. ఠాగూర్ మధు సమర్పణలో భువన్, శ్రీకర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి రవి బస్రూర్ సంగీతమందిస్తుండగా.. మనోజ్ పరమహంస ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నా రు. పాన్ ఇండియా స్థాయిలో తెలుగు, తమిళం, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ మూవీకి మనోజ్ పరమహంస సినిమాటోగ్రాఫర్. స్వయంభు చిత్రానికి కేజీఎఫ్ ఫేం రవి బస్రూర్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్, సంగీతం అందిస్తుండటంతో అంచనాలు భారీగానే ఉన్నాయి.

